చేసింది చాలదనీ, ఇంకా ఏమేమో చెయ్యాలనీ సుందర్రావుకి అనిపిస్తోంది. అతని బుర్రలో ఎన్నో ఆలోచనలు.... ఎన్నోవ్యూహాలు:

"పాలేరోడూ, కూలోడూ కడుపునిండా తిని, తలెత్తుకు తిరిగే రోజెప్పు డొత్తదో!"

"అయ్యో బాబూ అవి బలిమాలితే నాయం జరిగేరోజులు కాదియ్య"........

తూర్పుదిక్కున అరుణభాను డుదయించాడు.

## జనం

శ్రీపతి

వలభై మైళ్ళ ప్రయాణమే అయినా రెండు గంటలు పట్టింది. దారంతా ఇళ్ళ కొస్తున్న పసుల మందలు. ఆ పసులకాపర్లు వాటిని రోడ్డుకు ఓపక్కనించి తోల్తారా అంటే రోడ్లకి ఒకపక్కే ఉంది రెండోపక్క అన్నదిలేదు. ఇంకొన్ని దగ్గరయితే ఎదురుగావస్తున్న రథాన్ని పూర్తిగారానిచ్చి రెండోరథం కదలాలి. ఇక అది ఏకారయి తేనేం– రెండు గంటల్లో వచ్చినందుకు సంతోషం.

డ్రయివర్ ఆపేసి 'ఇక్కడ దిగిపోవాలి సార్' అన్నాడు.

చౌదురి దిగాడు. చుట్టూ కొబ్బరితోటలు. రకరకాల చిన్నా పెద్దా చెట్లు. అన్నీ ఒకేరంగుతో నల్లగా. అడవిలోకి వచ్చినట్టుంది.

దగ్గర్లో చింతచెట్టు కింద కూచున్న జనం ఐదారుగురొచ్చి 'నమస్కారం బాబయ్యా', 'నమస్కారాలు బాబయ్యా' అని కారులైటు వెలుతురులో కనిపిస్తున్న చౌదురిచుట్టూ చేరారు. వాళ్ళల్లో సుబ్బయ్యలేడు. అందరూ కొత్తవాళ్లు ఒక పేంటు కుర్రాడున్నాడు. మిగిలిన వాళ్ళంతా తలపాగాలు. నడుం చుట్టూ పంచెకట్టుకున్నవాళ్ళే. అలాంటి మనుషుల్ని గుంపుగా చూస్తే చౌదురికి అనుమానం. రెండేళ్ళ కిందటయితే అక్కడికి అలాంటి సమయంలో చౌదురి రాలేడు. కల్లోలిత ప్రాంతాలుగా పేరు మోసాయి. ఇప్పటికీనీ, భూస్వాములు ఇళ్లువిడిచి పేదల ఇళ్ళలో తలదాచుకునేవాళ్లు. లేదా టౌన్లకిపోయి హోటల్స్‌లో ఉండేవాళ్లు. ప్రభుత్వం తీసుకున్న కట్టుదిట్టాల వలన పరిస్థితి ప్రస్తుతానికయితే అదుపులోకివచ్చింది. అయినా చౌదురిగుండె పీకుతూనే ఉంది. పెళ్ళిపేరుతో కుట్రకాదుకదా అన్న అనుమానం అక్కడదిగిన తర్వాత మొంచు

133

కొచ్చింది. డ్రైవర్ కారులైట్ తీసేస్తే ఆన్‌చేయమని చెప్పి అందరికీ ప్రీతి నమస్కారాలు చేసాడు.

'కారు ఇంక ముందుకెల్లదు బావు- ఇక్కడే ఆ సింతసెట్టు కింద దాన్నొదిలేసి- తఁవరు ఊర్లోకి--' అని ఒక ముసలిగొంతు చెప్పింది. 'నాలుగడుగులు నడిస్తే ఊరు బావు. ఈ తోటలమూలాన ఊరు కనబడదుకాని--' అని ఇంకో పెద్దవయసు గొంతు చెప్పింది.

'సొరాజ్జెం వొచ్చినోజుల్లో ఇక్కడ ఈగడ్డమీద వొంతెన కటతారన్నారు బావు. ఏదీ సొరాజ్జెం. ఈ ఊరికొక బస్సులేదు. ఒకరోడ్డు ఇదేనా అప్పుడేకాలానో కరువొస్తే ఏసినోడ్డు- దానిమీద మల్లా మన్నన్నా కప్పిన పాపానపోలేదు. సూసుంతారు గదా అడ్డురోడ్డు తిరిగిన కాడ్నించి- ఈ ఊరుదాటితే అటు పదూళ్ల ఇంకా అదవాన్నం. ఈ రోడ్డుకూడా లేదు' అని సొరాజ్జాన్నెరిగిన ఒక నడివయసు మనిషి జీరగొంతులో చెప్తున్నాడు.

చౌదురిగారి కారువెలుగుతో రోడ్డు, ఆముందు పెద్దవంతర, దానిచుట్టూ తోటలు కన్పిస్తున్నాయి. ఆ వెలుతుర్లో జనం కొంచెం కొంచెం స్పష్టంగా కన్పిస్తున్నారు మూడు తలపాగాలు. అయిదు బనీనుల్లేని నల్లటి ఎండిన శరీరాలు. చెప్పుల్లేని జంతువుల పాదాల్లాంటి పెద్దపెద్దపాదాలు. మకిలికొమ్మలకు అతుక్కొన్న ఊడల్లాగ ఉబ్బిన నరాలతో మోకాళ్ళు

'లగ్నం ఏళ అవొస్తన్నాది బావు. నడుతుమా?' అని మళ్లీ ముసలిగొంతు.

'సుబ్బయ్య నీకొడుకా?' అడిగాడు చౌదురి ఆ పోలికలు చూసి.

'కాదు బావు, మా తమ్ముని కొడుకు'.

'పెళ్ళికొడుక్కి పెద్దయ్య అవుతాడు బావు' జీరగొంతు

'డ్రైవేరు బావూ, వస్తన్నావా? ఇక్కడ కారుకాపలా మనోళుంతారు' అన్నాడు ఇంకో తలపాగా.

కారుని చెట్టుకిందికి నడిపి లాక్‌చేసి దిగాడు. కన్నుపొడిచినా కనుపించనంత చీకటి.

ఆ ఎదురొచ్చిన జనంలో ఒక టార్చిలైట్ వెలిగింది. డ్రైవర్‌కూడా టార్చిలైట్ వెలిగించాడు.

జనం చౌదురి అంగరక్షకుల్లాగా చుట్టి నడుస్తున్నారు.

డ్రైవర్ యూనిఫామ్‌లో ఉన్నాడు. చౌదురే వయసుల్లో చిన్నవాడయితే డ్రైవర్ మరీ చిన్నవాడిలా ఉన్నాడు. ఇరవైరెండు ఇరవైమూడేళ్లు దాటవు. ఇద్దరు

134

తలపాగా మనుషులు కారుదగ్గర ఉండిపోయారు. వస్తున్నవాళ్ళల్లో ఒకాయన చింతచెట్టు కింద మంటవి పుల్లతో అటూ ఇటూకదిపి బీడి వెలిగించుకుని ఒక అంగలో ముందు నడుస్తున్నవాళ్లతో కలిసిపోయాడు.

*   *   *

కొండ పంచనకట్టిన వూళ్ళో వీధిలా ఉంది. ముందుకు పోతున్నకొద్దీ మెట్లెక్కు తున్నట్టుంది. దానికితోడు ఇరుగ్గా. ఐదారుగురు నడిస్తే ఒకరివెనక ఒకరు నడవాలి. లేదా రెండోమనిషి రాళ్లమీద, కట్టెలమీద అడుగులేస్తూ, చిత్తడినేలను దాటుకుంటూ పోవాలి. వాళ్లందరికీ అలవాటే చౌదురి గుడ్డివాడు నడుస్తున్నట్టుగా తడుముకుంటు న్నాడు.

దూరంగా పెళ్ళి హడావిడి గొడవ. పెట్రొమాక్స్ లైట్లవెల్తురు. జనం ఊరికే పరుగులెట్టున్న సందడి. ఓపక్క కుక్కల గొడవ. పల్లెటూళ్ల పసుల మందల వాసన.

కొత్తదేశాన్ని చూసినట్టుగా ఉంది చౌదురి పల్లెటూళ్ల చూసాడు. కాని ఇల్లాంటి ఊరు చూడలేదు. వీధిలో ప్రతి ఇంటిముందూ ఒకటో రెండో మేకలో, ఆవుదూడలో గొర్రెలో పందుకునో నుంచునో - ఉన్నాయి.

పొప్రియిటర్ వస్తున్నారని నడి తెలీటంతోనే సుబ్బయ్య ఎదురొచ్చి నమస్కారం చేసి విధేయంగా నుంచున్నాడు. పెళ్ళికొడుకు అన్నది మరిచిపోయి తను ఎప్పుడూ కళాసీనే అన్నట్టుగా ఉంది వాడితీరు. పొప్రియిటర్ బాపు తనపెళ్ళికి వస్తున్నాడన్న సంగతి వూళ్ళో అందరికీ కాకపోయినా తనకులంలో అందరికీ తెలిసిపోయింది. గొప్పగా, గర్వంగా చెప్పుకున్నాడు. ఏ తొందర పనిఇబ్బందిలంగానన్నా పొప్రియిటర్ బాబు రాలేకపోతాడో ఏమోనని ఇప్పటిదాకా భయపడుతున్నాడు. ఇప్పుడు ఆ భయ మంతా పోయింది.

'బాబొచ్చినాడు.... పొప్రయిటెర్ బాబొచ్చినాడు.... పట్నం బాబొచ్చినాడు....' అని చెప్పుకోవడం, మనుషుల్ని తప్పించుకుని చౌదురిని చూడడం .. మళ్ళీ 'మన సుబ్బయ్య పొప్రయిటర్ బావురా. టౌన్ల మిల్లు, లారీలూ, పెద్ద హొటేలూ— ఆ బాబు— ఆ బాబు యీ మట్టిమీన అడుగుపెట్టినాడంటే అదే పెయ్యివరాలు రాజులాంటి మనిషి. తండ్రి సనిపోయినతరాత ... సిన్నోడయినా తండ్రికంటె గనుడనిపించు కున్నాడు....' అని మిల్లుసంగతి పట్నం సంగతి బాగా ఎరిగిన పెళ్ళికొచ్చిన పొరుగూరు పెద్దమనిషి చెప్తున్నాడు. వచ్చి మూగుతున్న జనమంతా నమస్కారాలు కురిపిస్తున్నారు.

జనం దృష్టి పెళ్ళికొడుకు మీదినుంచి జారిపోయి చౌదురిమీద పడింది.

వీధిలో పెళ్ళి పందిరికి దగ్గరగా నుంచున్నాడు చౌదురి. సుబ్బయ్య, ఐదారుగురు పేంటులేసుకున్న మిత్రులూ, ఇంకా పెళ్లిపెద్దలు చుట్టుముట్టారు.

కుంటుకుంటూ వచ్చాడు సుబ్బయ్య తండ్రి. పక్షవాతం. అదీ ప్రమాదకరంగానే ఉంది. కొత్త నేతపంచె ఒకటి కట్టుకున్నాడు. కొత్త తువ్వాలు ఒకటి భుజాన ఉంది. నుంచోవటానికి చాలా కష్టపడుతున్నాడు. ఎడంకన్ను చిన్నదయిపోయింది. ఎడంపక్క మూతి ముడుచుకు పోయింది.

ప్రొప్రయిటర్ అనుకుని కారు డ్రయివర్‌ని రెండోచేతిని ఎత్తలేక నమస్కారం చేసాడు. పక్కనున్నవాళ్లు ఎవరో చూపితే మళ్ళీ చౌదురుని నమస్కారం చేసాడు. ఎడంకాలు ఎడంచేయి చచ్చుపోయాయి. మందులు కొనాలి బాబూ అని సుబ్బయ్య మధ్యమధ్య డబ్బు మేనేజర్‌ని అడుగుతుండేవాడు. అట్లాంటి దృశ్యాలు చూస్తున్నప్పుడు బతకటానికి వంద అబద్ధాలు అనుకునేవాడు చౌదురి.

పెళ్ళికొడుకు వేషంలో కళాసీ సుబ్బయ్య పసుపుబట్టలూ, మెడలో ఎరువుతెచ్చిన బంగారంచైను చిన్నదీ, కళ్ళకి కాటుక, నుదుట నామమూ, తలపాగా - యిన్ని ఉన్నా ఆడమ్మలుకూడా కొంటెచూపుల్తో. ఓరఓరగా, సిగ్గుతో. భయంతో చౌదురినే చూస్తున్నారు. పాతవాళ్ళు పనులమీదికిపోతున్నా కొత్తవాళ్ళు ఇంకా ప్రొప్రయిటర్ బావును చూడటానికి ఎగబడుతూనే ఉన్నారు.

ఒకపక్క భోజనాలవుతున్నాయి. కొంచెందూరంగా. వీధిలోనే. అక్కడ వడ్డనల గొడవ. ఆకరి. కడుపుమంటగొడవ.

ఆ పెళ్ళికివచ్చిన వాళ్ళంతా ఆ వూరి కులంవాళ్ళు తప్పించి వేరేవాళ్ళు ఎవరూ ఉన్నట్టులేదు. మా రుకులంవాళ్ళు నలుగురయిదుగురు నేస్తాలువచ్చినట్టున్నారు అంతే.

పేంట్‌కుర్రాళ్ళు ఇద్దరు చౌదురిని ఎదురుగాఉన్న సిమ్మెంట్ అరుగుమీదికి తీసుకుపోయారు. తాటికమ్మల ఇల్లేఅయినా నీటుగాఉంది. అక్కడ ఒక వాలుకుర్చీ ఉంది. కింద జంపఖానా పరచిఉంది. ఆ ఇంటి ఎదురుగానే పెళ్ళిపందిరి. కొబ్బరికమ్మలతో, మామిడి ఆకుల తోరణాలతో, కొత్తవెదురు బొంగులతో పెళ్ళిపందిరి. అలికి ముగ్గులతో అలంకరించిన పెళ్ళిపందిరి.

ఇట్లాంటి పొదుపుఅంటే చౌదురికి చాలాఇష్టం. పెళ్ళిళ్ళకోసం హడావిడిచేసి వేలకివేలు తగలబ్టేతీరు ఆతడికి నచ్చదు.

నర్సయ్య బిలాయ్‌నించి స్నేహితుని పెళ్ళికోసంవచ్చాడు. ఇరవైయ్యేళ్ళ పేంట్‌కుర్రాడు. ఆతడు చౌదురికోసం అన్ని ఏర్పాట్లుచూసే ఇన్‌చార్జి. వాలుకుర్చీలో చౌదురి

136

కూచున్నాడు. గుంపుగాచేరినజనం వెళ్ళిపోయినతర్వాత నలుగురయిదుగురు స్నేహితులుమాత్రం చౌదురిచుట్టూ మిగిలారు.

'బాబూ' ఈ వూళ్ళ ముప్పయి నలభై ఎకరాలకుమించిన రైతు ఒక్కడు లేడండి. కాని బాబూ యీ పెద్దమనుషులకున్న గర్వంమాత్రం యింతా అంతా కాదంటె నమ్మండి. మాలాంటి పేదోళ్ళం ఏ పట్నంలోనో ఏదో చిన్న ఉద్యోగంలోచేరి వస్తె మరీ పేంటు వదల్లేంగదా. ఆళముందు పేంటేసుకుని నిలబడకూడదు. చెప్పులు తొడుక్కుని ఆళముందు నడకూడదు. తెల్లనిబట్ట వొంటిమీద ఉండకూడదు చూసినారో. అప్పుడు నాలుగేళ్ళకిందట పారిపోయినాను, యీ కంబారిబతుకు తప్పిపోయింది బతికిపోయినాను. మీరు తలంచితే యీవూరుకొనేయగలరు. కళాసీ. పెళ్ళని తమరు- అంతదూరంనించి- ఎన్నిపనులున్నా ఇటొచ్చినారు. మరి వూళ్ళోని పెద్దమనిషి ఒక్కడేనా ఇటొచ్చినాడేమో చూడండి. ఆళ ఇల్లకిపోయి అకూసెక్కాఇచ్చి. బత్తెమిచ్చి. కులసంగానికిచెప్పి, మల్లా ఇంటింటికిచెప్పినా- ఎవ్వరూరాలేదు మరి వూళ్ళోని ఆళకి సావొచ్చినా, పెళ్ళొచ్చినా, పండుగొచ్చినా, అవసరమొచ్చినా మా జనమంతాపోయి నిలబడతాం.'అని బిలాయ్ కార్మిక మిత్రుడు పెద్దమనుషులమీద కోపంతో మాటాడుతున్నాడు.

పెళ్ళికొడుకు కనిపించినట్టే కనిపించి మాయమయ్యాడు.

చౌదురిచుట్టూ అందరూ ఒక యీడువాళ్ళు కూచున్నారు. వాళ్ళలో బిలాయ్ కార్మికుడు మాట్లాడుతున్నాడు. చూడగా మరికొంచెంసేపు చనువిస్తే సోషలిజంగురించి లెక్చర్ ఇచ్చేట్టున్నాడు. కుర్రాడు విగ్గుతీసినట్టు సన్నగా ఏపుగా బలంగా ఉన్నాడు. కళ్ళు పెద్దగా ఎర్రజీరతో పదునుగా ఉన్నాయి.

ఇంకో కెరటం జనం అక్కడ పోగవుతుంటే తోలేసాడు నర్సయ్య

ముహూర్తం వేళయింది పెళ్ళికొడుక్కోసం బాపనయ్య వెతుకుతున్నాడు. 'ఇప్పుడే వస్తాడుండండి'అని నర్సయ్య చెప్తున్నాడేకాని ఎక్కడికెళ్లిందీ చెప్పడు.

కిక్కిరిసిన జనం అంటే చౌదురికి ఇరుగ్గా ఉంటుంది. ఆ జనం ఎక్కడ ఎప్పుడు చెలరేగిపోతారోని భయం. నలుగురయిదుగురుకంటె ఎక్కువజనం ఉంటే అతడికి పడదు. ఇలాంటి పెళ్ళిళ్లన్నా, సినిమాహాల్సులో జనమన్నా, స్టేడియమ్‌లో జనమన్నా చౌదురికి వినోదంగా ఉంటుంది, ఇప్పుడు చౌదురి దృష్టి అక్కడ అటూ ఇటూ తిరుగుతున్న ఆడపిల్లలమీద పడింది. పేదవాళ్ళే అయినా కాయకష్టంతో బిగువు దేరిన శరీరాలు. జాకెట్ల నాగరికత అంటుకోని జనాభా. పెద్దపెద్దకళ్ళు. పేదరికాన్ని యవ్వనంతో కప్పుకున్నవాళ్ళు. కాయకష్టమే ఒక అందమన్నట్టుగా అక్కడ మనుషులు.

పెళ్ళి కొడుకు ప్రత్యక్షమయ్యాడు.

స్వీట్స్, జీడిపప్పు స్టీల్ ప్లేట్స్‌తో తెచ్చి చౌదురిముందు నుంచున్నాడు. వెనకే ఇంకో కుర్రాడు స్టూల్ మోసుకొచ్చాడు.

'ఏడీ కామేశు, ఎక్కడ?' అడిగాడు చౌదురి డ్రైవర్ గుర్తొచ్చి.

'అన్నం తింటున్నాడు బాబు'

'ఎక్కడ, ఎప్పుడు జారుకున్నాడు?' చౌదురికి తనసేవచేసేవారంటే అభిమానం. తనమాట వినేవారంటే అభిమానం. అందుకోసం కామేశుని వెతికాడు.

స్టూల్ మీద సుబ్బయ్య అన్నీ సర్దుతున్నాడు.

సన్నాయి మోత పెళ్ళిమేళం ఆరంభమయింది. పెళ్లికొడుక్కోసం ఎవరో వచ్చారు ఆడాళ్లు.

'అటు వెళ్ళరా. ఈ సంగతి తర్వాత . ' అని కోప్పడ్డాడు చౌదురి.

'ఆఁ ఆఁ వెళ్లిపోతున్నాను బాబూ', అని నర్సయ్యను పిలిచి డ్యూటీ అప్పజెప్పి వెళ్ళిపోయాడు.

తనకిపెట్టిన స్వీట్స్ జీడిపప్పు కనీసం పదిరూపాయిలన్నా ఖరీదుచేసేట్టున్నాయి. చూడగా అవి ఇక్కడ దొరికేట్టు కన్పించలేదు. అవన్నీ తినేంత ఆకలి చౌదురికి లేదు. కాని సుబ్బయ్య అభిమానం, భక్తి.

కళాసీగానే సుబ్బయ్యను ఇన్నాళ్లూ చూసాడు. వాడు మిల్లులో బస్తాలు మోస్తాడు లారీలు లోడ్‌చేస్తాడు. అన్‌లోడ్ చేసాడు. ఒక్కోసారి లారీతో వెళ్తాడు. టీనీళ్ళు తాగుతూనో. బీడీ వెలిగించుతూనో అప్పుడప్పుడు కనిపించేవాడు. అంతకంటె వాడికథేం తెలీదు.

సందుచేసుకుని సుబ్బయ్య తల్లి వచ్చింది. జుత్తంతా నెరిసిపోయి నడుం పడిపోయిన ముసలితనం. పీక్కుపోయిన నెత్తుర్లేని మురిగ్గుడ్లలాంటి వొళ్లు. 'బాబూమన స్కారం' అని పాదాలు పట్టుకోబోయింది. పాదాలు పట్టుకుంటుంటే చౌదురికి ఇబ్బదిం అయింది. అంతకంటె తనభక్తిని చెప్పుకునేందుకు ఆ ముసలమ్మకు ఇంకోభాషరాదు. నర్సయ్య 'బాపనయ్య పిలుస్తున్నాడు, పద అని తీసుకుపోయాడు అక్కడినించి. అలా పాదాలకి మొక్కడం నర్సయ్యకి నచ్చలేదు. కాని పాతమనుషులు, వాళ్ళబతుకులంతే.

బాపనయ్య తంతు ఆరంభమయింది. ఒక కోణంలో మనుషుల సందులోంచి పెళ్ళిపీటలమీద సుబ్బయ్య కనిపిస్తున్నాడు. సన్నాయిమేళం పక్కింటి గడపలో కూచున్నారేమో చెవుల్లు గింగుర్లెత్తిపోతున్నాయి. జీడిపప్పు ఒక్కొక్కటే నోట్లో వేసుకుంటున్నాడు.

'పాలు బాబూ' అని వర్సయ్య స్టీల్ గ్లాసుని స్టూల్ మీద ఉంచాడు.

* * *

'సుబ్బయ్య ఇప్పుడు మనిషయినాడుగాని బాబూ— మీ కొలువులో సేరిందాకా ఆడు మనిషికాడు. అప్పుడు యీ పెళ్ళికూతురు పిల్ల ఉన్నాదే— దానిపేరు జోగమ్మ— అది యీడిని పెళ్ళాడుతానంటే— దాని అమ్మా అయ్యా కానిచ్చినారుకాదు. ఆడు పెద్ద నాయిడుకాడ కంబారి. ఆ పెద్దనాయిడున్నాడంటే ఆడు మనుషుల్నెత్తురుతాగే మనిషికాని మామూలు మనిషికాడు అడి చెయ్యపడి ఎన్ని ఇళ్లు నాశనమయిపోయినాయో, ఎందరు కన్నెపిల్లలు కడుపులొస్తే నూతిలోపడి చచ్చిపోయినారో ఆదంతా ఒక రామాయణం. సుబ్బయ్య నాతోటే బిలాయ్ వచ్చేవాడు కాని పెద నాయిడుకి బయిపడి రాలేకపోయినాడు. తల్లీ దండ్రీ అడిమీద ఐదొందలు అప్పుతెచ్చి నారు పెదనాయిడుకాడ. ఆ అయిదొందలూ తీర్చేయాలంటే ఆడు ఐదేళ్లు కంబారితనం చేయాల. కంబారోడికి పిల్లనియ్యనని కూకున్నాడు యిప్పుడీ జోగమ్మ కన్నతండ్రి. ఆపిల్ల ఇష్టంలేని మనువు. గొర్రెలు కాసుకుంటాడు ఎంకన్న. ఆడికిచ్చి పెళ్లిచేసినాడు— పెళ్ళని పేరేగాని వారం దినాలుకూడా అత్తోరింటికాడ మనవలేదు జోగమ్మ. తర్వాత మనువుకే ఎల్లలేదు. కాని అప్పటికే దానికడుపున ఒక కాయ ఎడిపోయింది'.

పెళ్లి ఊరేగింపుకి వెళ్లింది. మనుషులు కూడా అంతా ఊరేగింపుతో వెళ్ళిపోయారు. వీధికి తూర్పున ఐదారుగురు వంట మనుషులు వడ్డన మనుషులు అన్నీ సర్దుతున్నారు ఉన్న ఒకే పెట్రొమాక్స్ లైట్ ని ఊరేగింపుకు తీసుకుపోయారు. చౌదురి కూచున్న అరుగుమీద ఓ మూలకు అరికెన్ లాంతరు పేదవాళ్ల బతుకులాగ మిణుకు మిణుకు వెలుగుతున్నది.

చౌదురి స్వీట్స్ లని పాలుతాగిన తర్వాత యీజీచైర్ లో మాగన్నుగా నిద్రపట్టింది. అసలు చౌదురి అంతసేపు అక్కడ ఉండాలని రాలేదు వచ్చి ఓసారి పెళ్లికొడుకును చూసేసి పోవాలని వచ్చాడు. పెళ్ళి పూర్తయేవేళకి నిద్రపోతున్నాడు. నిద్రలేపడం ఇష్టంలేక కొంతసేపు డ్రైవర్ కామేశు అక్కడేచూసి తర్వాత పెళ్ళివాళతో వెళ్ళిపోయాడు.

బిలాయ్ కార్మిక యువకుడు నర్సయ్య. పోస్ట్ బంట్రోతు సిమ్మన్న. సింగిల్ స్కూల్ టీచర్ సీతారాముడు, వర్సయ్య తమ్ముడు వీరరాఘవులు చౌదురి చుట్టుకూచుని కబుర్లు చెపుతున్నారు. కుర్చీలో కూచోవడం ఇబ్బందిగా ఉండి చౌదురి కిందగోడకానుకుని కూచున్నాడు. రెండోమనువు అమ్మాయిని సుబ్బయ్య చేసుకోవడం ఎక్కడో హాలివుడ్ సినిమాల్లో, ఇంగ్లీషు నవలల్లో జరిగినట్టుగా ఉంది, పైగా ఒక పిల్లవానితో.

పరాయి మగవానితో మాటాడినందుకు, ఎక్కడినించో ఒక ఉత్తరం ముక్క వచ్చినందుకు, ఎవరో ఇచ్చిన బహుమతికి సంబంధం చెప్పనందుకు, మాటాడినా మౌనంగా ఉన్నా విపరీతమైన అర్థాలు సాగదీసి సంసారాలు కూలిపోయే ఈ దేశంలో ఒక మగవానితో కాపరంచేసి, పిల్లవాణ్ని కన్న స్త్రీని– దాన్నిదేన్నీ పట్టించుకోకుండా సుబ్బయ్య పెళ్ళి చేసుకోవడం విచిత్రంగా ఉంది. అడిగితే 'మా కులంల మారు మనువులున్నాయిబావు అడది ఏడు మనువులు మనవాచ్చు' అని చెప్పాడు వీరరాఘవులు.

మళ్ళీ చౌదరికి ఆశ్చర్యం కలిగింది.

'బాబూ, మా కులంలో ఇష్టం లేకపోతే ఇడాకులిచ్చేసి మరొక మనువుచేసికుంటారు. ఆదే యీ పెద్దకులమోళ్ళ సంగతి చూడండి. ఎన్ని రంకుతనాలో, ఒకసామె తున్నాది బాబు పెద్దసెరువు కంపు పెద్దింటి రంకు బయటపడదని. అలాగ....' అని మళ్ళీ నర్సయ్య భూస్వాముల మీదికి తిరిగి రేచుకుక్కలా పడ్డాడు.

నర్సయ్య తిట్లలో కొన్ని అందరు ధనవంతులకీ వర్తిస్తాయి. అవి చౌదరికి తగుల్తున్నాయి. 'ఈ కష్టపడేవాళ్ళ చెమట నెత్తురూతాగి ఎంతకాలం ఈ లంజకొడుకులు సుకపడతారో జనం చూస్తారు బాబూ. ఈ లంజకొడుకుల్ని చూడండి ఒక్కడూ మంచి చావు చవ్వడు. ఒక్కొక్కడికి ఒక్కొక్క పెద్దరోగం వస్తాది. మీకు తెలుసునో తెల్దో గాని బాబూ, ఈ పెద్దనాయుడు తండ్రి కాళ్ళూ సేతులూ రాలిపోయి, ఒళ్లు చర్మమంతా పుళ్ళయి ఇప్పటికీ బతికేఉన్నాడు. నరకమంటే ఎక్కడో ఉండదు బాబూ– మా కాయా కష్టం మనుషుల సంగతి చూడండి. జబ్బో జరమో వొస్తాది. నాలుగురోజులు కంటే మంచం మీదుండడు. సుకంగా చచ్చిపోతారు' అని చెప్తున్న మాటలు వింటున్నాడు. ఎదురు మాటాడడం ఇష్టంలేదు. వినివిని విసుగెత్తిపోయాడు. ఇట్లాంటి సంగతులు వినడం చౌదరికి అస్సలు ఇబ్బందిగా ఉంటుంది.

తన గురించి ఈ బిలాయ్ కార్మిక యువకునికి బొత్తిగా తెలీదు. అనుకోవటానికి వీల్లేదు. ధనవంతులను తిట్టేతిట్లు తనకు తగుల్తాయని తెలిసిమరీ తిట్తున్నాడు. లేక ఈ పెళ్ళికి వచ్చినందుకు తనని మరీ గొప్పవానిగానన్నా భావిస్తూ ఉండాలి. లేక ఇక్కడ వాళ్లతోపాటు ఈ గచ్చు అరుగుమీద చలిలో కూచున్నందుకు వాళ్ళతోటిమనిషిగానన్నా తీసుకొని ఉండొచ్చు. ఒక్కటి మాత్రం ఖాయం నర్సయ్యకి చాలా కోపం, పగ, ద్వేషం, కసి ఉన్నాయి, ఆవూరు పెద్దమనుషుల మీద.

* *

టార్చిలైట్ వెలుగు తమవేపు రావటం కనిపించింది.

'నమస్కారాలు బావూ, నమస్కారాలు'

చూరు చాటున ఆ వచ్చిన మనిషి తలకాయ కన్పించలేదు. ఎమ్మెల్యేలాగా ఖద్దరు పంచె ఖద్దరు చొక్కాతో కన్పిస్తున్నాడు. ఇంకొంచెం పక్కకొచ్చాడు గడప ముందుకు. ఇప్పుడు ముఖమయితే కన్పించిందిగాని రాట నీడ ముఖంమీద పడింది. లాంతర్‌ని పోస్టు బంట్రోతు సిమ్మన్న కొంచెం పక్కకి పెట్టాడు. లాంతరు వెలుగు ముఖంమీద పడినా ఆ కొత్తమనిషి పరిచయమున్న గుర్తు చౌదురికి లేదు.

'పెద్దనాయుడు బావు' అని నిలబడ్డారు ఉరాశ్రీలంతా.

'ఆరె సర్పిగా. పెద్దమనుషులొస్తే ఇంటికొచ్చి సెప్పొద్దురా. ఎంత నీవు ఉద్యోగం సేస్తున్నా- వూరు పరువూ మర్యాద యింత దేగి మర్చిపోతె మంచిదికాదురా. నివు బిలాయిలోనో యీశాపట్నంలోనో పేంటూబూటూ యేసుకోవచ్చు కాని అంజకొడకా నీతల్లీ తండ్రి, నీ పెల్లీ తమ్ముడూ ఇక్కడ బతకాల. ఆ మద్దిన నీ తండ్రిని ఎవడో పొరుగూరోడు మక్కలిరగదన్నాడు ఎవడడ్డమొచ్చాడ్రా. నివు బిలాయినుంచి పారొచ్చినావా. ఊరు సంగతి మరిచిపోకంద్రా. ఏంమేష్టరు ఇక్కడ కూకుండి పోయినావు బావుగారొచ్చినారనొచ్చినావు ఈ లంజకొడుకులకి కళ్లు నెత్తిమీది కెక్కిపోయినాయి బావు.' అంతలో తను వచ్చిన పని గుర్తుకొచ్చింది. 'బావూ తమరు ఇక్కడ కూకుండి పోయినారు. లెగండి మనింటికి ...' అని గొంతు స్వరం. మాటతీరు అమాంతం మార్చేసి మాటాడాడు. ఇంతక ముందు నర్సయ్యనుతిట్టిన నోరేనా చౌదురిని బతిమాలుతున్నది అనిపించింది. అక్కడకి కొత్తగా వచ్చిన సింగల్ టీచర్ సీతారాముడుకి.

ఆ పెద్దమనిషి వచ్చీరావడంతోనే అందుకున్న ధోరణి చౌదురిని కొంత ఆశ్చర్యపరచింది. అతడికి భూస్వాముల స్నేహం ఉంది. చాలామందిని బాగాఎరుగును. ఈ పద్ధతిలో మాటాడ్డం చౌదరి వినలేదు నక్సలైట్‌లు ఈ జిల్లాలో వచ్చినతర్వాత కూడా ఈ ధోరణిలో భూస్వాములున్నారంటే నక్సలైట్లు రాకపూర్వం ఇంకా ఎట్లా ఉండేదో ఊహకు అందటంలేదు.

వందమందికి మించిన ఉద్యోగులు కళాసీలు చౌదురికింద పన్చేస్తున్నారు. వాళ్ళకి కార్మిక సంఘంలాంటిది ఏంలేకపోయినా మంచిగా మాటాడుకుని పనిచేయించుకోవటంలో ఉన్న లాభం. ఈ ధోరణిలో ఉండదని తక్కువకాలంలోనే చౌదురి గుర్తించాడు. తనకింద పనిచేసే మనుషులంతా ఒట్టి అల్పసంతోషులు. ఒక మంచి మాటకీ, ఒక చిరునవ్వుకి ఇలాంటి సమయంలో ఇచ్చిన పదిరూపాయిల కట్నంకీ, చావొస్తే పోయి పలకరించినందుకీ సంతృప్తిపడిపోయే అల్పసంతోషులు. అది బాగా తెలుసుకున్నాడు కాబట్టే తన బలగంచేత రెట్టింపుపని చేయించుకో గలుగుతున్నాడు. వాళ్ళ పేర్మికి, అభిమానానికి పొసిషియటర్ బాబు మంచోడు అన్న గౌరవానికీ నోచుకున్నాడు.

141

చౌదురి రెండేళ్ళకిందట తండ్రి చనిపోయేవరకు యూనివర్సిటీ విద్యలోఉన్నాడు. తర్వాత తల్లీ మేనేజరూ వ్యాపారాన్ని నడుపుకొచ్చారు. ఇటీవల ఒక సంవత్సరంగా మాత్రిమే చౌదురి హయాం ఆరంభమయింది. కిందటి పార్లమెంట్ ఎలక్షన్‌లో చౌదురికి రాజకీయాల్తో ప్రత్యక్షసంబంధం ఏర్పడింది. కొత్త కాంగ్రెస్ పేర్లలో చౌదురి పేరు కలిసింది. పెద్ద రాజకీయ నాయకులువచ్చి తమ పరిధిలోకి లాగుతున్నారు. చౌదురికి ఇప్పుడిప్పుడే రాజకీయాలు 'మంచి' వ్యాపారంగా దేశభక్తిగాతోచాయి. అయితే రాజకీయాలకి ప్రజల మనుసుల్ని తెలుసుకోవడం చాలా అవసరం. అలాంటి అవసరంకూడా ఉంది చౌదురి ఈరోజు ఇక్కడికి వచ్చాడు. ఇంతసేపు సర్పయ్య. సింగిల్ టీచర్ సీతారాముడు. వీరరాఘవులు, సిమ్మన్నవాళ్ళతో గడిపినప్పుడు వాళ్ళ మనసు అర్థమయింది. అందుకే నోటిని బాగా కంట్రోల్ చేసుకున్నాడు. లేకపోతే అక్కడ సర్పయ్యతో పేచీవచ్చేది. తిట్టిన తిట్లన్నీ భరించాడు. ఆ ఓపికతోనే చౌదురిని అక్కడి కుర్రాళ్ళు ఇష్టపడ్డారు. భయపడకుండా మాటాడారు.

'మన ఎమ్మెల్యే బావులేడు. ఆయనగారొచ్చారు బావు. ఇప్పుడు మనింట్లో ఉన్నారు. అక్కడ సింతసెట్టుకాడ కారున్నాది అని తెలిస్తే- ఆరాతీసినాను. తంవ రొచ్చినారన్నసంగతి తెలిసింది. ఎమ్మెల్యేబావు తమని కలవాలన్నారు 'అని మళ్ళా ఆరంభించాడు.

పెదనాయుడే అక్కడికిరావడం ఆ కుర్రాళ్ళందరికీ కొత్తగాఉంది. పెదనాయుడు సర్పంచ్ అయ్యాడు రెండుసార్లు. గాని ఓట్లుకోసంకూడా ఆయన ఆ వీధికి రావల్సిన అవసరం పడలేదు. ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాడు మరొకడిని మరొకడినయితే పెదనాయుడు ఏ మామూలు మనిషిచేతో కబురుచేసి రప్పించేవాడు. వచ్చింది చౌదురిఅవటం వలన తనే స్వయంగా తీసుకుపోవటానికి ఈ రాత్రిపూట టార్చిలైట్ వేసుకుంటూ వచ్చాడు.

వెళ్ళటమా మానటమా అన్న సందేహంలో పెదనాయుడు ముఖంలోకి చూసాడు చౌదురి పెదనాయుడు గెద్దలాగ కనబడ్డాడు. పూర్వజన్మలో నమ్మకమున్నవాళ్ళకి గెద్ద జన్మనించి మనిషిజన్మలోకి పెద్దనాయుడు పుణ్యం చేసుకుని వచ్చాడని తటుతుంది. సర్వప్రాణులూ సమానమే అనే జీవకారుణ్యవాదులకి గెద్దలూ మనుషులూ ఒకే పోలికకి పెదనాయుడు సాక్ష్యంగా ఉంటాడు. డార్విన్ సిద్ధాంతంకి కూడా ఒక ఆధారం కనిపిస్తుంది అక్కడ. ఆ కొనదేరిన వంగిన ముక్కు, కళ్ళు, చివరికి ఆ మెడ, ఆ చూపు- అన్నీ గెద్ద లక్షణాలే.

చౌదురి వెళ్ళిపోవాలన్న ఉద్దేశంతో వచ్చాడు. డ్రైయివర్ ఊరేగింపుతో పోవటం మూలాన ఆగిపోయాడు. అంతలో ఇప్పుడు వెళ్ళటం బావుంటుందా అన్న సందేహం కూడా కలిగింది. నక్సలైట్లు వచ్చి వ్రిజల్ని రేకెత్తించి వదిలారు అన్న ఆలోచనకూడా వచ్చింది. దాంతో ఉదయానికే తిరుగు ప్రయాణం పెట్టుకున్నాడు. కామేశు లారీమీద పర్లాకిమిడిపోవాలి. తెల్లారేపోవాలి. ఈరూటు కామేశుకి తెలుసని తీసుకొచ్చాడు. కొత్తవూళ్ళో, ఇక్కడ ఈ పూరింటి అరుగుమీద ఇబ్బందిగానే ఉంది. చలి ఒకపక్క. పైగా ఎమ్మెల్యే ఉన్నాడు. ఒకసారి పోయి కలుసుకోవడం అవసరం. అంచేత బయల్దేరాడు నాయుడుతో.

* * *

కారుదగ్గర చౌదురిని సాగనంపటానికి పెద్దనాయిడు, ఎమ్మెల్యేరెడ్డి, గురివి నాయిడు, శోభనాచలం గుమిగూడారు. అంతా ఎమ్మెల్యేల్లాగున్నారు.

కొబ్బరి కమ్మల్లోంచి కాంతి చువ్వలు దూసుకొస్తున్నాయి. ఉదయంతో చెట్లు రకరకాల రంగుల్ని పులుముకున్నాయి. నేలమట్టికే అక్కడ అందమొచ్చింది. ఇంకా పొగమంచు చెట్లమీద వాలి ఉంది. చెట్లనించి మంచు చినుకులు కురుస్తున్నాయి.

కామేశు ఇంకా రాలేదు.

'ఆ సుబ్బడింటికాడ డ్రైవేరు ఉన్నాడు కేకెయ్యరో' అని పనిమీద పోతున్న మనిషితో చెప్పాడు పెదనాయిడు. వెంటనే ఆ మనిషి వెనక్కితిరిగి వూళ్ళోకి పరుగెత్తాడు. ఇంకో నిమిషానికి 'ఈడికేం రోగమొచ్చింది ఇంకా కనబడ్డు' అని మళ్ళీ విసుక్కున్నాడు.

పనులన్నీ మాటలమీద జరగాలి. వాళ్ళకి అక్కడ నుంచునేంత తీరికలేదు. డ్రైవర్ ఇంకా రాలేదు.

దూరంనించి చెట్లమధ్యనించి జనం,- ఏడెనమండుగురు గుంపుగా పులులు గుహల్లోంచి వస్తున్నట్టు. పట్నం వెళ్ళివచ్చే మనుషులంటే వూళ్లోనాయిళ్లకు గుండెదడ. దానికితోడు నక్సలైట్లొచ్చిన తర్వాత ... ఎంతమందిని కాల్చి చంపిస్తున్నా నేల యీనినట్టు జనం పుట్టుకొస్తునే ఉన్నారు.

వాళ్లొస్తున్న దిక్కు చూస్తుంటే పెదనాయిడుకి భయమేసింది. 'దండొస్తున్నారు' అన్నాడు ఆ భయంతోనే.

శోభనాచలం గుర్తుపట్టి 'ఆ నడక సూడరా౹. సుబ్బడు, నర్సడు, గొడ్డు, గురవన్న కంబారి, మా మామగారి పనోడు— మనూరి పనోళ్ళేన్రా' అన్నాడు.

గురువినాయిడుకి జంకుపుట్టి అక్కణ్ణించి మెల్లిగా తప్పుకున్నాడు. అటువేపే వాళ్లతోట ఉంది. తర్వాత ఎమ్మెల్యేరెడ్డి, పెదనాయిడు అక్కణ్ణించి 'వస్తాం వస్తాం' అనిచెప్పి జారుకున్నారు. తర్వాత శోభనాచలం 'వస్తాం బాబు' అని కదిలిపోయాడు.

చౌదురి మిగిలిపోయాడు.

డిసెంబరు నెల ఆ చలిలో చౌదురికి వొళ్ళంతా చెమటపోసింది. ఆ వస్తున్న మనుషుల్ని చూసికాదు. ఆ వెళ్ళిపోయిన పెద్దమనుషుల తీరుచూసి.

కామేశు వాళ్ళమధ్య.

సింగిరి స్కూల్ టీచర్ సీతారాముడు ఒంటెలా పొడుగ్గా ఉన్నాడు. బిలాయ్ నర్సయ్య. పోస్టుబంట్రోతు సిమ్మన్న పులుల్లా ఉన్నారు. వాళ్ళమధ్య కామేశు హీరోలా ఉన్నాడు మిగిలిన కొత్తముఖాలన్నీ నివురుగప్పిన నిప్పుల్లా ఉన్నాయి.

అంతా కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు.

'ఉండిపొమ్మని పట్టేసినారు సార్. వాళ్లందర్నీ బతిమాలుకొని యిడిపించుకు న్నాను. నర్సయ్య కెమెరా తెచ్చినాడు సార్. అందరితో ఫొటో కావాలన్నారు సార్. క్షమించండి సార్ ఆలస్యమయిపోయింది'

దూరంనించి ఐదారుగురు పరుగెత్తుకొస్తున్నారు.

చౌదురికి ఇదేదో కథల్లో, సినిమాల్లో ఉండే కుట్రలా ఉంది.

వాళ్లు ఎందుకలా పరుగెత్తుకొస్తున్నారు. ఇది కల్లోలిత ప్రాంతం. వాళ్లు ఎవరు. వాళ్లచేతుల్లో ఏమిటున్నాయి. వాళ్లని వదిలేందుకొచ్చారు వీళ్లు ముందు. గుండెకొట్టుకుం టున్నది.

'ఇంక పద'

డ్రైవర్ సీట్లో కూచున్నాడు. వీల్ మీద ఓచెయ్యి పడింది.

'అన్నా అన్నా ఇదిగో సింగన్న తెల్లోడు అళ్ళొస్తున్నారు. ఉండొక్క చిటం ఉండుండు'

ఇంజన్ స్టార్ట్ అయింది.

పరుగులో వస్తున్నారు.

రాత్రింతా వాళ్ళకి నిద్రలేదు. మంట వేసుకుని చుట్టూకూచుని పాటలు పాడు కున్నారు. కబుర్లు చెప్పుకున్నారు. ఈ పేదరికం పోతుందని కామేశు నర్సయ్య చెప్తుంటే వాళ్లకి చాలా ఆనందమయింది.

144

రాత్రి ఊరేగింపులో పెళ్లివాళ్ళతోపోయి పెళ్ళి ఆటలు ఆడినప్పుడు, తర్వాత మంట ముందుకూచుని చలికాగుతూ వాళ్లతో పాటలు పాడినప్పుడు, వాళ్లతో అన్నా తమ్ముళ్లా మాట్లాడినప్పుడు కామేశు వాళ్లవాడయినాడు. మళ్ళెప్పుడొస్తాడో. పనుల్లోపడి సాగనంప లేకపోయినారు.

వచ్చినవాళ్ళు అలసిపోతూ ఆగి 'ఏమన్నో ఎలిపోతున్నావా' డ్రైవర్ సీటుదగ్గర గుమిగూడారు.

చౌదురికి గుర్తొచ్చింది రాత్రి వచ్చినప్పుడు తనని చుట్టుముట్టిన జనమే ఇప్పుడు తనదిక్కు చూడడం లేదు. మనసును కుళ్లబొడుస్తున్నట్టుంది. వెనకసీట్లో తను ఎడారిలో ఉన్నట్టున్నాడు.

వాళ్ళంతా నమస్కారాలు చెప్తున్నారు. తనకికూడా చెప్తున్నారు.
ఆ నమస్కారాలు చౌదరిని మరింత అవమానపరుస్తున్నాయి
కారు కదిలింది.
జనం ఆ కారును నడిపిస్తున్న మనిషి జాడను చూస్తూ నుంచున్నారు.
పాములు పుట్టల్లోకి పోయాయి. పక్షులు చెట్లకొమ్మల పైకి పోయాయి.

* * *

## సోషలిస్టు పబ్లికేషన్స్ అడ్రసు మార్పు

భారతదేశ విముక్తికి తోడ్పడే మార్క్సిస్టు విప్లవ సాహిత్యాన్ని కొన్ని సంవత్సరాలుగా అనేక వ్యయప్రయాసలకోర్చి పీడితప్రజలకు అందిస్తున్న మా సంస్థపైన అభివృద్ధినిరోధకప్రభుత్వం కక్షబూని దాడి చేసిన విషయం ఆంధ్రప్రజలకు తెలిసిందే. ప్రభుత్వ దాడిమూలంగా వచ్చిన యిబ్బందులవల్ల షాపును దిగువ అడ్రసుకు మార్చటమైనది. ఇకమీదట ఉత్తరప్రత్యుత్తరాలు దిగువఅడ్రసుతో జరపవలసిందిగానూ, యథావిధిగాసంస్థతో సహకరించవలసిందిగానూ పాఠకులనుకోరుతున్నాం.

ఇట్లు,
సోషలిస్టు పబ్లికేషన్స్,
పబ్లిషర్స్ అండ్ బుక్‌సెల్లర్స్,
పెనుమాక (P.O.) గుంటూరుజిల్లా.

145